క్లుప్తంగా

కోనలో వైభవంగా హనుమద్ వ్రతం



స్వామివారిని క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : పెంచలకోనలో శుక్రవారం హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పెనుశిల లక్ష్మీ నరసింహస్వామికి అభిముఖంగా వెలసిన క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకం, పూలంగి సేవ చేశారు. 8 గంటలకు స్వామి ఉత్సవ మూర్తిని తిరుచ్చిపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం వెయ్యి నామాలతో ఆకు పూజ చేపట్టారు. స్వామి మాలధారణ భక్తులు దీక్ష విరమించారు. ఉభయకర్తలుగా మధుసూదనరావు వ్యవహరించారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి పాల్గొన్నారు.

కంచె తొలగింపు



రాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సైదాపురం : మండలంలోని చాగణం దళితులపై కూటమి నేతలు కక్ష సాధింపులకు దిగారు. పదేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమి చుట్టూ వేసుకున్న కంచెను అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి శుక్రవారం తొలగింపజేశారు. బాధితుల కథనం మేరకు.. సైదాపురం మండలం చాగణం దళితవాడకు చెందిన బి.ఉమాదేవి, కుమ్మరిగుంట పద్మమ్మ, కుమ్మరిగుంట అనూరాధ, మందా వెంకటేశ్వరమ్మ, బి సువర్ణమ్మ సర్వే నంబర్లు 518, 519లలో ఉన్న 4.23 ఎకరాల భూమిని పదేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. వాటికి పట్టాలు మంజూరు చేయాలని 2023లో తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. అధికారులు పట్టాలు ఇచ్చేందుకు అసైన్‌మెంట్ కమిటీకి ప్రతిపాదనలు పంపించారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి అధికారంలోకి రావడంతో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే నెపంతో గ్రామానికి చెందిన కూటమి నేతలు దళితులపై కక్ష సాధింపులకు దిగారు. భూమి చుట్టూ వేసిన కంచె రాళ్లను శుక్రవారం జేసీబీతో తొలగింపజేశారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన



పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం ఆర్డీవో కిరణ్మయి యాదవ్ పరిశీలించారు. అత్యవసర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రజాజీవనానికి విఘాతం కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం సూళ్లూరుపేటలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. వారికి అందిస్తున్న సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు.

నీటి తీరువా కట్టించుకోని రెవెన్యూ అధికారులు

దక్కిలి: నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నీటి తీరువా (పన్ను) తప్పనిసరిగా కట్టాల్సి ఉంది. వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని చాపలపల్లికి చెందిన పలువురు రైతులు పన్ను కట్టేందుకు శుక్రవారం ఉదయం నాగవోలు సచివాలయం వద్దకు చేరుకున్నారు. వీఆర్వో లేరు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. వారు మాట్లాడుతూ తొండాగుంట చెరువుకు శనివారం సాగునీటి ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఆయకట్టు రైతులు నీటి తీరువా బకాయిలు ఉండకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో వీఆర్వోల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొన్ని ఆయకట్టు ఓట్లు చేర్చాలని రైతులు పేర్లు ఇచ్చినా పట్టించుకోలేదు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు. దీనిపై వీఆర్వో విజయ్‌కుమార్ వివరణ కోరగా తాను ఉదయం నుంచి దక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నానని తెలిపారు. వడ్ల మోపూరు, చెన్నసముద్రం, దగ్గవోలు గ్రామాల ఆయకట్టు రైతుల నీటి తీరువా పన్నులకు రశీదులు రాస్తున్నానని పేర్కొన్నారు. ఎవరైనా ఉంటే దక్కిలికి వచ్చి నీటి తీరువా పన్నులను కట్టుకోవచ్చన్నారు.

డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని నిరసన

వాకాడు : మండలంలోని చినతోట పీహెచ్‌సీ డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ రామకృష్ణారావు కింది స్థాయి సిబ్బందితో అమానుషంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. ఇటీవల ఆస్పత్రి పరిధిలోని దుగ్గరాజపట్నంలో పని చేసే మహిళ రెండు రోజులు సెలవు కావాలని కోరితే హేళనగా మాట్లాడడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. ఆమె హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. డాక్టర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అచ్యుతకుమారి పీహెచ్‌సీకి చేరుకుని సిబ్బందిని విచారించారు. స్థానికులు ఆమెను కలిసి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.



దొరవారిసత్రం : మినమనముడి గ్రామ సమీపంలో వరద నీటితో నిండిపోయిన రైల్వే అండర్ బ్రిడ్జి



సూళ్లూరుపేట రూరల్ : గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల వద్ద భారీగా నిలిచిన వరద నీరు



సూళ్లూరుపేట రూరల్ : కోటపోలూరు వద్ద పుచ్చాకాలువ పొంగడంతో రోడ్డుపై చేరిన వరద నీరు

నియోజకవర్గంలో కురిసిన వర్షం వివరాలు

మండలం	బుధవారం	గురువారం	మొత్తం వర్షపాతం మి.మీలలో
సూళ్లూరుపేట	34.6	117	151.6
నాయుడుపేట	39.4	68.4	107.8
దొరవారిసత్రం	63.6	89.2	152.8
పెళ్లకూరు	81.2	89.2	170.4
ఓజిలి	27.6	51.8	79.4
తడ	55.4	104.2	159.6

నీటిలోనే పంటలు

- అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు
- పొంగిపొర్లుతున్న నదులు, కాలువలు
- రైల్వే అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీరు
- గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



సూళ్లూరుపేట రూరల్ : నాదెండ్లవారికండ్రిగ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

సూళ్లూరుపేట/దొరవారిసత్రం/ఓజిలి/సూళ్లూరుపేట రూరల్ : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని స్వర్ణముఖినది, కాళంగినది, మామిడికాలువ, పాములకాలువ, పుచ్చాకాలువ, కారిపేటి కాలువ, దొండకాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. కాళంగినది, పాములకాలువ ప్రవాహంలో తూర్పుకండ్రిగ, నాదెళ్లవారికండ్రిగ, కాదలూరు, వెండ్లూరుపాడు గ్రామాల్లో పంట పొలాలు మునిగిపోయాయి. నాదెళ్లవారి కండ్రిగ, మోదుగులపాళెం, తల్లంపాడు, మావిళ్లపాడు, పడమటకండ్రిగ, ఇలుపూరు, కాదలూరు, వెండ్లూరుపాడు, కారిజాత, వాటంబేడు, చేనిగుంట, కొండూరు, అక్కంపేట, గ్రద్దగుంట, గోపాల్‌రెడ్డిపాళెం గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. కాళంగి డ్యామ్‌కు గేట్లు ఎత్తడంతో లోతట్టు ప్రాంతాల్లో వున్న వట్రపాళెం గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలించారు. గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డు వద్ద జాతీయ రహదారిపై నీరు ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తమ సిబ్బందితో రెండు భారీ క్రేన్‌లు, రెండు జేసీబీలను ఏర్పాటు చేశారు. వాహనాలను ఒక్కొక్కటిగా దగ్గరుండి దాటించే ప్రయత్నాలు చేశారు.

- దొరవారిసత్రం మండలంలోని వెదురుపట్టు, మీజూరు, కారికాడు, వేలికాడు, తల్లంపాడు, టపాయిండ్లు, అక్కరపాక, కుప్పారెడ్డిపాళెం, ఏకొల్లు, లింగంపాడు, మొదుగులపాళెం, బురదమడుగు, కల్లూరు, శ్రీధనమల్లి, పూలతోట, కొత్తపల్లి తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. నెర్రికాలువ వరద వల్ల మినమనముడి, చందనముడి, వెదురుపట్టు, కట్టువాపల్లి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కట్టువాపల్లి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, శ్రీనధనమల్లి, మానేరి, కల్లూరు, పూలతోట, కొత్తపల్లి చెరువు కట్టలు ప్రమాదకరంగా మారాయి.
- ఓజిలి మండలంలోని మామిడికాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. 100 ఎకరాల్లో వేసిన వరినాట్లు నీట మునిగాయి.

గ్రామాలను చుట్టు ముట్టిన వరద నీళ్లు..

దొరవారిసత్రం మండలంలోని నెర్రికాలువ, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు వరద నీటితో నిండిపోవడంతో మినమనముడి, చందనముడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నెర్రికాలువకు వరద పోటెత్తడంతో మినమనముడి సమీపంలోని బ్రిడ్జి మునిగిపోయింది. అదే విధంగా చందనముడి-జంగాపల్లి మధ్యలో లోలెవల్ బ్రిడ్జి మునిగింది. రైల్వే అండర్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోవడంతోరాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కాళంగి డ్యామ్ నుంచి 12 వేల క్యూసెక్కుల నీరు కిందకు వదలడంతో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో పంట పొలాలు మునిగిపోయాయి. ముఖ్యంగా ముదురుకోపులో వేసుకున్న ఎల్డిపైర్లు ఎన్నుదశలో వున్నాయి. ఈ పరిస్థితుల్లో భారీ వర్షానికి గింజ సత్తుతేలిపోయే అవకాశం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా మిరపపంట వేసుకున్న రైతులు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

పులికాట్ సరస్సుకు భారీగా వరదనీరు...

నియోజకవర్గంలోని నదులు, కాలువల నీటితో పాటు కాళంగి డ్యామ్ నుంచి విడుదల చేసిన సుమారు 25 వేల క్యూసెక్కుల నీరు పులికాట్ సరస్సుకు చేరుతోంది. వరద నీరు సూళ్లూరుపేట-శ్రీహరికోట రోడ్డును ముంచెత్తే అవకాశం ఉండడంతో షార్ అధికారులు అప్రమత్తమయ్యారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు.

కష్టమంతా నీటి పాలు



సకాలంలో వర్షాలకు కురిశాయని ఎంతో కష్టపడి అప్పు చేసి ఎకరాలో వరి సాగు చేశాను. పంట బాగా వస్తుందని అనుకునే సమయంలో తుపాను వల్ల భారీ వర్షం కురిసింది. పొలంలోకి నీరు చేరడంతో కష్టమంతా నీటిపాలు అయింది. ప్రస్తుతం ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మేలకల రఘురామయ్య, తల్లంపాడు, దొరవారిసత్రం

పంట అంతా నాశనమే



వేణుంబాకం ప్రాంతంలో వందల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం పొట్ట, ఎన్ను దశలో ఉంది. ఇలాంటి తరుణంలో తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో పంటలు మొత్తం వరద నీటిలో మునిగిపోయాయి. ఇక పంట ఉంటుందని అనుకోవడం అత్యాశే. అంతా నాశనం అయింది. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

– బుద్దతొట్టి గురవయ్య, వేణుంబాకం, దొరవారిసత్రం



సూళ్లూరుపేట రూరల్ : కాళంగి పొంగడంతో జాతీయ రహదారిపై చేరిన వరద నీరు



ఓజిలి: పంట పొలాలు మునిగిపోవడంతో చూస్తూ ఆందోళన చెందుతున్న రైతులు



సూళ్లూరుపేట రూరల్ : వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రాపూరు : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తెలిపారు. రాపూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు పక్కా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. మండలంలో కార్యదర్శుల కొరత ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవాని తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. సైదాపురం ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక స్థితిగతులపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దయాకర్, ఏవో హైమావతి, సర్పంచులు వరప్రసాద్‌రాజు, శారద పాల్గొన్నారు.



సైదాపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్

మధుసూదన్‌రెడ్డికి కిలివేటి పరామర్శ

ఓజిలి: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పిండుకూరు మధుసూదన్‌రెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి భార్య, సర్పంచ్ మౌనికారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంజీవయ్య ఆస్పత్రికి వెళ్లి మౌనికారెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాషా, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, నాయకులు ఒట్టూరు కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మౌనిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యకు పరిష్కారం

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ రీసర్వేలో భూములు వివరాల్లోని మార్పులు, చేర్పులు, తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : కల్లూరు, అడపాముడి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే, మ్యుటేషన్స్, 1బీ, అడంగళ్లలో పేర్ల మార్పులు, చేర్పుల కోసం రైతులు అర్జీలు అందజేసినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు.

గూడూరు రూరల్ : రెవెన్యూ సదస్సులపై రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు కోరారు. చెన్నూరులో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న భూమికి హక్కులు కల్పించాలన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని రామసాగరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

దక్కిలిలో..

దక్కిలి : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. నాగులపాడు, తిమ్మాయిపాళెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సుల్లో 14 అర్జీలు వచ్చినట్టు పేర్కొన్నారు.



ఓజిలి: భట్లకనుపూరులో అర్జీలను పరిశీలిస్తున్న డీటీ మధుసూదన్‌రాజు

చిల్లకూరులో..

చిల్లకూరు : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో 24 అర్జీలు వచ్చినట్టు పేర్కొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : మండలంలోని మర్లపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు వచ్చినట్టు మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ సర్వేయర్ తెలిపారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళితుల భూములను కాపాడాలని వినతి

పెళ్లకూరు: మండలంలోని పునబాకలో ఆక్రమణకు గురైన దళితుల భూములను కాపాడాలని పలువురు బాధితులు కోరారు. గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్ : పొదుపు సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు, పొదుపు ఏపీఎంలు, మెప్మా సభ్యులకు రుణాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలు బాగుంటాయన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కోట : మండలంలో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. మండలంలో 20 సాగునీటి సంఘాలు ఉన్నాయని, 3,700 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

పకడ్బందీగా ఎన్నికలు

దొరవారిసత్రం : మండలంలోని 36 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు మండల ఎన్నికల అధికారి హరికృష్ణ, తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. వారు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీవోలు, సిబ్బందితో సాగు నీటి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. 36 చెరువుల ఎన్నికలకు తొమ్మిది బృందాలను నియమించామన్నారు. ఎంపీడీవో గోవర్ధన, ఏవో రఘురామయ్య పాల్గొన్నారు.

16 నుంచి ఎల్ఎస్‌డీజీ శిక్షణా తరగతులు

ఓజిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో ఎల్ఎస్‌డీజీ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల విద్య, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ర్యాలీకి భారీగా తరలిన నేతలు



నాయుడుపేట టౌన్ : ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితర నాయకులు

నాయుడుపేట టౌన్ : రైతుల సమస్యలపై నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ చేపట్టిన రైతు గర్జనకు సూళ్లూరుపేట నియోజవర్గం నుంచి నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు తప్ప అభివృద్ధి లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మీ, జిల్లా కార్యదర్శి ఒట్టూరు కిషోర్ యాదవ్, పాపాడి చంద్రారెడ్డి, దారారవి, కాలగంధ సునీల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు కష్టాలు

పెళ్లకూరు : కూటమి పాలనలో రైతులకు కష్టాలు, కన్నీళ్లు తప్ప సంక్షేమం కరువైందని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రైతు గర్జనకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. గోమతి సర్కిల్ వద్ద పార్టీ జెండాను ఊపి ర్యాలీగా నెల్లూరుకు బయలుదేరారు.

ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, నాయకులు దశరథరామిరెడ్డి, బాలసుబ్రమణ్యం, మోహన్, వీరకుమార్, బాలు, జితేంద్ర, మాతయ్య, బాలాజీ, ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌నాయుడు, కుమారస్వామి, కృష్ణయ్య, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

చిల్లకూరు /నాయుడుపేట టౌన్ : ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వెంకటగిరిలోని కైవల్యానదికి వరద పోటెత్తింది. ఆ నీరు గూడూరు ప్రాంతంలోని పంబలేరు మీదుగా చిల్లకూరు మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న ఉప్పటేరులోకి చేరుతోంది. సముద్రంలో పోటు ఎక్కువగా వస్తుండడంతో వరద నీరు వెనక్కి తన్నుతుండడంతో తిప్పగుంటపాళెం రోడ్డులోని బ్రిడ్జిపై నాలుగు అడుగుల పైగా నీరు ప్రవహిస్తోంది. అధికారులు ఆయా మార్గాల్లో రాకపోకలను నిలిపేశారు.

స్వర్ణముఖి నది ప్రవాహం

కోట : భారీ వర్షాలకు స్వర్ణముఖి నదికి వరద పోటెత్తింది. గూడలి వద్ద బ్రిడ్జిపై నీటి ప్రవాహం పెరగడంలో కోట నుంచి గూడలి మీదుగా నాయుడుపేటకు రాకపోకలు స్తంభించాయి. చెరువులు కళకళలాడుతున్నాయి. ఊనుగుంటపాళెం వద్ద కాజ్‌వేపై మామిడికాలువ నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో రుద్రవరానికి రాకపోకలు నిలిచిపోయాయి. పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టలు బలహీనంగా ఉండడంతో అధికారులు పరిశీలించారు. గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో వెంకటగిరి వైపు వాహనాల రాకపోకలు స్తంభించాయి. మేనకూరు సెజ్‌కు వెళ్లే భారీ వాహనాలు తుమ్మూరు సమీపంలో బ్రిడ్జిపై నిలిచిపోవడంతో గంటల కొద్ది ట్రాఫిక్ స్తంభించింది. తహసీల్దార్ రాజేంద్ర, సీఐ బాబి పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కాజ్‌వేపై ఉన్న చెత్తను జేసీబీతో తొలగించారు.

బ్యారేజ్ గేట్లు ఎత్తివేత

వాకాడు : మండలంలో స్వర్ణముఖి నదిలో 27 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో వాకాడు బ్యారేజ్‌కు ఉన్న 34 గేట్లలో ఏడు గేట్లు ఎత్తి వేసి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. బ్యారేజ్ కింద ఉండే అన్ని చెరువులకు నీటిని ఇప్పటికే విడుదల చేశామని, వాటిలో పూర్తి స్థాయిలో నీరు ఉందన్నారు. అందువల్ల పంటలకు ఢోకా ఉండదన్నారు. అనంతరం బాలిరెడ్డిపాళెం వద్ద గతంలో తెగిపోయిన కర కట్ట రక్షణ చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.



నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నది వద్ద కాజ్‌వేపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



కోట : గూడలి వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద



వాకాడు: బాలిరెడ్డిపాళెం సమీపంలో కర కట్ట వద్ద గండి పడిన చోట ప్రమాదకరంగా ఉన్న స్వర్ణముఖి



చిల్లకూరు: ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



కోట : పుచ్చలపల్లి వద్ద పొర్లు కట్టలను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు